క్లుప్తంగా

డయేరియాపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండండి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సింగరాయకొండ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో స్టాప్ డయేరియా పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అతిసార వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. డాక్టర్ ఉజ్వల, ఈఓఆర్డీ సుధాకర్, జలజీవన్ మిషన్ అధికారి డీ రవి, ప్రధానోపాధ్యాయులు హరేరామ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల జియార్తులు



దర్గాలో జియార్తులు సమర్పిస్తున్న భక్తులు, ముజావర్‌లు

పామూరు: మొహర్రంలో భాగంగా 12వ రోజున నిర్వహించుకునే జియార్తుల కార్యక్రమాన్ని ముస్లింలు శనివారం పీర్లచావిళ్ల వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముజావర్లు మాట్లాడుతూ పవిత్ర యుద్ధం చేస్తూ మహ్మద్ ప్రవక్త అనుచరులు అశువులు బాసిన తీరును స్మరించుకుంటూ వారి త్యాగానికి నిదర్శనంగా 10 రోజులపాటు మొహర్రం పండుగ వేడుకలు జరుపుకుంటారన్నారు. కదనరంగంలో అశువులుబాసిన వీరుల ఆత్మకు శాంతి చూకూరాలని పీర్ల చావిళ్ల వద్ద జియార్తులు నిర్వహించారు. ఈసందర్భంగా గుండం వద్ద గంధం, పప్పులు, తమలపాకులు, బొరుగులుచల్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జియార్తులతో మొహర్రం పండుగ వేడుకలు ముగిశాయని ముజావర్లు షేక్.ఖాజా మొహిద్దీన్ తెలిపారు.

పొగాకు పండుగుల్ల, సూర, ముక్క బేళ్ల కొనుగోలు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో పొగాకు పండుగుల్ల, సూర, ముక్క బేళ్లు శనివారం వేలం నిర్వహించారు. కె.ఉప్పలపాడు, కారుమంచి గ్రామానికి చెందిన రైతులు పండుగుల్ల బేళ్లను 47 తీసుకురాగా అన్నింటినీ కొనుగోలు చేశారు. అత్యధిక ధర రూ.186, అత్యల్ప ధర రూ.60, సరాసరి ధర రూ.140.96 పలికింది. అలాగే 424 పొగాకు సూర, ముక్క బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 402 బేళ్లు కొనుగోలు చేశారు. 22 పొగాకు సూర, ముక్క బేళ్లు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.150, కనిష్ట ధర రూ.60, సరాసరి రూ.92.88 ధర పలికింది. ఇప్పటి వరకు 2828 సూర, ముక్క బేళ్లు కొనుగోలు చేయగా, గరిష్ట ధర రూ.150, కనిష్ట ధర రూ.60, సరాసరి రూ.100.01 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 20 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

విద్యార్థి అదృశ్యం కేసు నమోదు

మర్రిపూడి: బీటెక్ విద్యార్థి కనిపించడం లేదంటూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై శివబసవరాజు తెలిపారు. మండలంలోని శివరాయునిపేట గ్రామానికి చెందిన పాతకోట వెంకటరెడ్డి కుమారుడు రోహిత్‌రెడ్డి సత్తెనపల్లి లయోలా కళాశాలలో బీటెక్ ఫైనల్ ఈయర్ చదువుతున్నాడు. ఆ సమయంలో రోహిత్‌రెడ్డి క్రికెట్‌బెట్టింగ్, విద్యార్థులతో తిరుగుతూ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. బీటెక్‌పూర్తి చేసుకున్న రోహిత్‌రెడ్డి గత నెల 2వ తేదీ శివరాయునిపేట గ్రామానికి వచ్చాడు. గత మూడు రోజుల నుంచి కుమారుడు కలిపించలేదని బంధువులను విచారించినా ఆచూకీ కనిపించలేదు. కళాశాలకు వెళ్లి ఫీజ్‌కట్టి, సర్టిఫికెట్లు తెచ్చుకోవాలని ఇంట్లో చెప్పివెళ్లి తిరిగి ఇంటికి రాలేదని కుటుంబసభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రోహిత్‌రెడ్డి సోదరుడు సురేంద్రరెడ్డి ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

డంపింగ్ యార్డ్‌లు కాదు.. రహదారులు



రోడ్లకిరువైపులా ఉండి సగం రోడ్డులోని వచ్చిన చెత్త



చెత్తలో సంచరిస్తున్న పందులు

కొండపి (సింగరాయకొండ): నియోజకవర్గ కేంద్రమైన కొండపిలో రోడ్లు డంపింగ్ యార్డ్‌లను తలపిస్తున్నాయి. కొండపి నుంచి జాళ్లపాలెం వెళ్లే రోడ్డులో చెత్త, చెదారం నిండి మురికి కూపంగా మారింది. పంచాయతీలో సేకరించిన చెత్త, చెదారం జాళ్లపాలెం రోడ్డు పక్కన వేయడంతో చెత్త అంతా రోడ్ల మీదకు చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దానికి తోడు పందులు, కుక్కలు చెత్తలోకి వెళ్లి చెత్తను రోడ్డు మీదకు నెట్టడంతో పాదచారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. అక్కడే పందులు, కుక్కలు నివాసాలుగా మార్చుకొని అక్కడే సంచరిస్తూ ఉండడంతో వాహన రాకపోకలకు ఇబ్బందితో పాటు, వాహనదారులకు పలు ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. అదేవిధంగా చెత్త కుళ్లి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. చెత్త ఎక్కువ రోజులు అక్కడే ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది డెంగీ, మలేరియా, చికున్ గున్యా వంటి రోగాలు సంభవిస్తాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ వారు గ్రామంలో సేకరించిన చెత్తను ఊరికి దూరంగా జన సంచారం లేని ప్రదేశంలో పారవేయాల్సి ఉండగా ఊరికి దగ్గరలోనే వేయడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని ప్రజలు అన్నారు. ఇప్పటికైనా అధికారులు చెత్తను తొలగించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధులు తెస్తా

- ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, పక్కన వేదికపై చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: కనిగిరి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు తెస్తానని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక పురపాలక సంఘం అత్యవసర కౌన్సిల్ సమావేశం శనివారం మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ పట్టణాభివృద్ధిలో అందరం కలిసి పనిచేద్దామని తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి పెడతానన్నారు. నీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికా బద్ధమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

రూ.82 కోట్లతో పట్టణాభివృద్ధికి ప్రణాళికలు..

మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి ప్రక్రియలు చేపట్టేందుకు రూ. 82 కోట్లతో ప్రణాళికలు రూపొందించినట్లు చైర్మన్ అబ్దుల్ గఫార్ తెలిపారు. రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ సమస్య పరిష్కారం, కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్ అభివృద్ధి రూ.13 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసినట్లు చైర్మన్ గఫార్ వివరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య మెరుగుదలకు 30 మంది పారిశుధ్య కార్మికులను తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సమావేశంలో పలువురు సభ్యులు మాట్లాడుతూ రోడ్లు, మురికి నీటి కాలువలు, నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు, పారిశుధ్యం, విద్యుత్, నీటి సమస్యలను విన్నవించారు. ఏఐబీ స్కీం ద్వారా ఇంటింటికీ సాగర్ నల్లాతో సురక్షిత నీటిని పట్టణ ప్రజలకు అందించాలన్నారు. కుక్కల బెడద తీవ్రంగా ఉందని, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తక్షణ చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

సమావేశంలో 60 అంశాలకు ఏకగ్రీవ ఆమోదం..

మున్సిపల్ అత్యవసర సమావేశంలో 60 అంశాలతో కూడిన అజండాను ప్రవేశం పెట్టారు. ఎటువంటి చర్చ లేకుండా అజెండాలోని అన్ని అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో కమిషనర్ టీవీ రంగారావు, వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, రాచపూడి మాణిక్యరావు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండండి



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సుబ్బారావు

జరుగుమల్లి (సింగరాయకొండ): ప్రాణాంతక వ్యాధి అయిన క్యాన్సర్‌ను నిర్లక్ష్యం చేయవద్దని ప్రముఖ అంకాలజిస్టు నూకసాని సుబ్బారావు అన్నారు. జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం క్యాన్సర్ పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ పొగతాగడం, మద్యం తాగడం వలన క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరికీ వ్యాయామం తప్పనిసరన్నారు. కొంతమందికి వారసత్వంగా రొమ్ము, అండాశయం, పేగు క్యాన్సర్‌లు వస్తాయన్నారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని చెప్పారు. ఆహారం, జీవనశైలిలో మార్పు, వ్యాయామం ద్వారా క్యాన్సర్ వ్యాధి బారినపడకుండా జాగ్రత్త పడవచ్చని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు మర్రిబోయిన శ్రీనివాసరావు, ఆయుర్వేద డాక్టర్ లక్ష్మీబాయి, ఎంఈఓ నాగేంద్రవదన్, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పంటసాగు హక్కు పత్రాలతో లబ్ధి



మూలగుంటపాడులో పంటసాగు హక్కు పత్రాలను అందజేస్తున్న తహశీల్దార్ భవానీ శంకర్

సింగరాయకొండ: కౌలు రైతులకు పంటసాగు హక్కు పత్రాల వలన ఎంతో ఉపయోగాలున్నాయని తహశీల్దార్ భవానీశంకర్ తెలిపారు. మండలంలోని కలికవాయ, మూలగుంటపాడు గ్రామాల్లో కౌలుదారు హక్కు పత్రాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు పత్రాల వలన రైతులకు కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. రైతులకు పంటసాగు హక్కు పత్రాలను స్వయంగా అందజేశారు. ఏఓ సుధాకర్, వీఆర్‌ఓలు, సచివాలయ కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.

వీసీపల్లి: కౌలు రైతులకు సాగు ధ్రువీకరణ పత్రాలు త్వరితగతిన జారీ చేయాలని వ్యవసాయాధికారి జి.వెంకటస్వామి అన్నారు. మండలంలోని గుదేవారిపాలెం, పెదఅలవలపాడు ఆర్బీకేల్లో కౌలు రైతులకు కార్డు జారీ చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు ఇచ్చే కార్డులు కేవలం పండించే పంటపైనే హక్కు ఉంటుందని, పంట నష్టపోతే నష్టపరిహారంపై మాత్రమే హక్కు ఉంటుందన్నారు. భూమిపై ఎటువంటి హక్కు లేదన్నారు.

హనుమంతునిపాడు: మండలంలోని హాజీపురం, వాలిచర్ల, దాసరిపల్లి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ కె.వెంకటరమణ, తహసీల్దార్ కె.కిషోర‌రెడ్డి మాట్లాడుతూ కౌలు కార్డులు పొందేందుకు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. భూమి లేని కౌలు రైతులు కౌలు కార్డులు తీసుకోవడం వల్ల ప్రభుత్వం అందించే పథకాలు పంట నష్టపరిహారం, బీమా, బ్యాంకు రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ గోపిక్రిష్ణ, వీఆర్వోలు, కార్యదర్శులు, వీఏఏలు రైతులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సీఎస్‌పురం(పామూరు): డెంగీ, మలేరియా, విషజ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా గణాంకాధికారి డాక్టర్ ప్రసాద్‌బాబు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించిన ఆయన సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా చూడాలన్నారు. దోమల నివారణకు మురికినీటి నిల్వలు లేకుండా చూసుకునేలా ప్రజలను పూర్తిస్థాయిలో చైతన్యవంతుల చేయించాలని వైద్యాధికారి డాక్టర్ నందిరెడ్డి మురళికి సూచించారు. జ్వరం లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకుని డాక్టర్ సలహాలు, సూచనలు పాటించాలన్నారు. గర్భిణులు, చిన్నపిల్లలకు సకాలంటే టీకాలు వేయించుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాలు చేయించుకోవాలని తద్వారా జనన ధ్రువీకరణ పత్రాలు పొందవచ్చని తెలిపారు. టాస్క్‌ఫోర్స్ బృందం కె.సుబ్బ లక్ష్మి, కె.సుగుణావతమ్మ, సీహెచ్‌ఓ వెంగయ్య, హెల్త్ ఇన్‌స్పెక్టర్ పద్మావతి, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీరామ లక్ష్మీకాంతమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్‌కు రూ.10 వేల జరిమానా

జరుగుమల్లి(సింగరాయకొండ): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం సెబ్ పోలీసులు పట్టుకుని రూ.10 వేల జరిమానా విధించారు. ఈ సంఘటన జరుగుమల్లి మండలం నందనవనం గ్రామం వద్ద జరిగింది. సెబ్ ఎస్సై దయాకర్ కథనం ప్రకారం..పలుకూరు మండలం వెంకన్నపాలెం గ్రామానికి చెందిన జి.వెంకటేశ్వర్లు అక్రమంగా ఇసుకను ట్రాక్టర్ ద్వారా తరలిస్తుండగా పట్టుకుని జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

22 నుంచి 28వ వరకు పాకల రైల్వేగేటు మూసివేత

సింగరాయకొండ: రైల్వే అభివృద్ధి పనుల్లో భాగంగా ఈనెల 22వ తేదీ నుంచి 28వ తేదీ ఆదివారం వరకు పాకల రైల్వే గేటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు సమాచారం ఇచ్చారని తహశీల్దార్ భవానీశంకర్ తెలిపారు. పాకల, పాకల బీచ్‌కు వెళ్లే ప్రజలు, పర్యాటకులు సోమరాజుపల్లి రైల్వేగేటును ఉపయోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలకు



విద్యార్థులతో మాట్లాడుతున్న జేవీవీ నాయకుడు గయాజ్

సీఎస్‌పురం(పామూరు): ఉన్నత విద్యతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని జనవిజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షుడు షేక్.గయాజ్‌బాషా అన్నారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో శనివారం విద్యాలయం ఎస్ఓ షేక్.రేష్మ అధ్యక్షతన విద్యార్థులకు చదువులు-విలువలు అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గయాజ్ మాట్లాడుతూ ప్రస్తుతం బాలికలు, మహిళలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని అధిగమించేందుకు ఉన్నతవిద్య ఒక్కటే సరైన మార్గమన్నారు. ఎంఈఓ ప్రసాదరావు మాట్లాడుతూ నేడు ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఉన్నాయని, మెరుగైన విద్యాబోధన ఉందని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎన్నుకుని వాటి సాధన కోసం ఇష్టంతో కష్టపడి చదవాలన్నారు. ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ కేటీసి పాపారాయుడు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యసాధనకోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

56.0 మి.మీ వర్షపాతం నమోదు

కనిగిరి రూరల్: కనిగిరి రెవిన్యూ డివిజన్‌లోని 13 మండలాల్లో 56.0 మి.మీవర్షపాతం నమోదు కాగా సరాసరినా 4.3 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. కనిగిరి మండలంలో 3.0 మి.మీ, వెలిగండ్లలో 9.6, పామూరులో 5.8, పీసీపల్లిలో 5.4, సీఎస్‌పురంలో 6.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



పురస్కారాలు అందజేస్తున్న కమిటీ నాయకులు

కనిగిరి రూరల్: ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులకు స్థానిక షిరిడి సాయిబాబా దేవస్థాన కళ్యాణ మండపంలో సాయి ప్రతిభా పురస్కారాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను మరింత ప్రోత్సహించేందుకు ఏటా పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు మెమోంటో, కాలేజీ బ్యాగ్‌ను అందచేశారు. దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మ, బద్వేటి కృష్ణ మూర్తి, ఆర్ సంజీవయ్య, కొప్పు కోటయ్య, సీహెచ్ వీరబ్రహ్మం, వాగిచర్ల వెంకటేశ్వర్లు, విజేత కళాశాల కరస్పాండెంట్ పసుపులేటి అరుణోదర్, ఎంఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.టరెడ్డి, హెచ్ఎంలు మాధవశర్మ, యూటీఎఫ్ నాయకులు రుషేంద్ర, రామరాజు, మస్తాన్‌వలి పాల్గొన్నారు.